# షుగర్ ఫ్యాక్టరీమూతకు కాంగ్రెస్సే కారణం

- ఆ కర్మాగారాన్ని లాకౌట్ చేసింది బీజేపీ మాజీ ఎంపీనే
- చెరుకు బకాయిలు చెల్లించింది కేసీఆర్ సర్కారే
- జీవన్ రెడ్డి బతుకమ్మపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు
- గల్ఫ్ కార్మికులనూ కేసీఆర్ బీమా పరిధిలోకి తెస్తాం
- మెట్‌పల్లిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత చిత్రంలో కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, కోరుట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్, జడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): నిజాం హయాంలో ప్రారంభమైన చెక్కర కర్మాగారాన్ని చంద్రబాబు అమ్ముతుంటే ప్రధాన ప్రతిపక్షం హోదాలో ఉండి చోద్యం చూసింది కాంగ్రెస్సేనని నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నది సీఎం కేసీఆరేనని స్పష్టం చేశారు. ఆయన తెచ్చిన మ్యానిఫెస్టో అద్భుతంగా ఉన్నదని, పేదలకు కొండంత అండగా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జగిత్యాల అభ్యర్థి డాక్టర్ ఎం సంజయ్‌కుమార్, కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీలను కాంగ్రెస్ ఏర్పాటు చేసిందని ఆ పార్టీ నాయకుడు జీవన్‌రెడ్డి అంటున్నారని, ఈ వ్యాఖ్యలు చూస్తే జీవన్‌రెడ్డికి సీనియారిటీ ఉంది కానీ, సిన్సియారిటీ లేదని అర్థమవుతుందని విమర్శించారు. 1937లో దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నిజాం ప్రభువు షుగర్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారని, అందులో కాంగ్రెస్ పాత్ర ఏమీ లేదని స్పష్టం చేశారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ నష్టాల ఊబిలో మునిగిపోవడానికి కాంగ్రెస్ పట్టింపులేని తనమేనని ధ్వజమెత్తారు. కానీ స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించడానికి 2015లోనే జీవో నెంబర్ 28ని జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవోను జారీ చేసిన విషయం తెలుసుకొని, ఫ్యాక్టరీని కొన్న బీజేపీ మాజీ ఎంపీ చెప్పాపెట్టకుండా లాకౌట్ ప్రకటించి ఫ్యాక్టరీలను ఖాయిలాపడిన సంస్థల శాఖ పరిధిలోకి నెట్టి వేశాడన్నారు. ఫ్యాక్టరీ ఆస్తులను తాకట్టు పెట్టి ₹150 కోట్ల మేర అప్పులు సైతం తీసుకున్నారన్నారు. రైతులకు, కార్మికులకు బీజేపీ నాయకుడు బకాయిలు ఎగ్గొట్టిపోతే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ₹66 కోట్లు చెల్లించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. రైతులను, కార్మికులను కడుపులో పెట్టుకొని కాపాడేది సీఎం కేసీఆర్ మాత్రమేనని చెప్పారు. ప్రస్తుతం షుగర్ ఫ్యాక్టరీల అంశం కోర్టు పరిధిలో ఉండడంతో ప్రభుత్వం ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

### రాహుల్ దొరల గురించి మాట్లాడడం విడ్డూరం

దొరలు, ప్రజలు అంటూ రాహుల్ గాంధీ ఏమేమో మాట్లాడుతున్నారని కవిత మండిపడ్డారు. మంథనిలో దొర అయిన శ్రీధర్‌బాబును పక్కన పెట్టుకొని రాహుల్‌గాంధీ దొరల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కరీంనగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు, దళితబిడ్డ, కవ్వంపల్లి సత్యనారాయణకు మాట్లాడే అవకాశం ఇవ్వనివారు, దొర శ్రీధర్ బాబును మాత్రం మాట్లాడించారన్నారు. జగిత్యాలలో రాహుల్ ప్రసంగాన్ని తర్జుమా చేయడానికి దళిత బిడ్డ అడ్లూరి లక్ష్మణ్‌ను కాకుండా దొరైన జీవన్‌రెడ్డికి ఎందుకు అవకాశం ఇచ్చారు? లక్ష్మణ్‌కుమార్ తర్జుమా చేయలేరా? అని ఆమె ప్రశ్నించారు. సంపూర్ణంగా దొరతత్వం తమ వద్ద పెట్టుకొని, రాహుల్ గాంధీ దొరల తెలంగాణ, ప్రజల తెలంగాణ అని మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

### బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో బాగున్నది

సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇటీవల విడుదల చేసిన మ్యానిఫెస్టో అద్భుతంగా ఉందని చెప్పారు. ముఖ్యంగా బీడీ కార్మికులకు ఎంతో లబ్ధి చేకూరేలా పథకం రూపకల్పన చేశారన్నారు. వీరితో పాటు సాధారణ మహిళలకు సైతం కట్ ఆఫ్ డేట్‌తో సంబంధం లేకుండా నెలకు 3వేల పెన్షన్ ఇవ్వబోతున్నారని చెప్పారు. 'కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికీ ధీమా' పథకం బాగున్నదని, రైతు బీమా తరహాలో పేదలకు ₹5 లక్షల మేర బీమా వర్తిస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం పెంచిన ధరలతో గ్యాస్ సిలిండర్ మనకు అందకుండా పోయి మళ్లీ కట్టెల పొయ్యి పెట్టుకునే దుస్థితి వచ్చిందని, ఈ భారాన్ని తగ్గించేందుకే సీఎం కేసీఆర్ గ్యాస్ సిలిండర్‌ను ₹400కు అందించాలని మంచి నిర్ణయం తీసుకున్నారని వివరించారు.

### గల్ఫ్ కార్మికులకూ కేసీఆర్ బీమా ఇస్తాం

జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో గల్ఫ్ కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉన్నదని కవిత చెప్పారు. ఒకప్పుడు పాలకుల పట్టింపులేనితనం వల్ల బతుకుదెరువు కోసం ఎడారి దేశాలకు వెళ్లారన్నారు. ప్రాజెక్టులతో సాగునీరు, 24గంటల కరెంట్, పెట్టుబడికి రైతుబంధు ఇస్తుండడంతో రాష్ట్రంలో వ్యవసాయం లాభసాటిగా మారిందని చెప్పారు. దీనిని చూసే ఎంతో మంది స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన వారు సైతం తిరిగి రావాలని కోరారు. ఒకవేళ రాలేక అక్కడే ఉపాధి పొందుతున్న వారి సంక్షేమం కోసం సైతం పనిచేస్తున్నామని, చేస్తూనే ఉంటామన్నారు. గల్ఫ్ కార్మికులతో తనకు ఎక్కువ అనుబంధం ఉందని, వారు కోరిన మేరకు రేషన్‌కార్డుల నుంచి పేర్లను తొలగించలేదన్నారు. అలాగే గల్ఫ్ కార్మికులకు సంబంధించి ఆదాయంతో పని లేకుండా వారి తల్లిదండ్రులకు పెన్షన్‌ను సైతం అందిస్తున్నామన్నారు. గల్ఫ్ కార్మికులకు సైతం బీమా వర్తించేలా సీఎం కేసీఆర్ 93 లక్షల కుటుంబాలను బీమా పరిధిలోకి తెస్తున్నారన్నారు. 'కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికీ ధీమా' పథకం గల్ఫ్ కార్మికులకు భరోసాను ఇస్తుందన్నారు.

### కొనుగోళ్లపై పరిమితి ఎందుకు?

కాంగ్రెస్ రాష్ట్రానికో మాట చెబుతున్నదని కవిత మండిపడ్డారు. తెలంగాణలో పండించిన పంటకు బోనస్ ఇస్తామని ఆ పార్టీ అంటున్నదన్నారు. కానీ, అదే పార్టీ పాలిస్తున్న ఛత్తీస్‌గఢ్‌లో ఎకరానికి 20 క్వింటాళ్ల పరిమితి విధించిందని, ఆ పరిమితి దాటితే ఒక్క గింజను కూడా మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం లేదన్నారు. కానీ పదేండ్లుగా ₹వేల కోట్లు వెచ్చించి, రైతులు పండించిన చివరి గింజ వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నదని స్పష్టం చేశారు. మూడు గంటలు మాత్రమే కరెంటు ఇచ్చి రైతులను గుల్ల చేయాలన్నది కాంగ్రెస్ ఉద్దేశమని విమర్శించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ హయాంలో కేవలం ఒకే ఒక్క బీసీ సంక్షేమ హాస్టల్ ఉండేదని, ఇప్పుడు 34 సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయన్నారు. ఇప్పుడు జీవన్ రెడ్డి, రాహుల్‌గాంధీ ముఖం ఎక్కడ పెట్టుకుంటారో ఆలోచించుకోవాలన్నారు.

### బొగ్గు గనులను ప్రైవేట్‌పరం చేసింది కాంగ్రెస్సే

సింగరేణి, షుగర్ ఫ్యాక్టరీల గురించి మాట్లాడే నైతికత కాంగ్రెస్‌కు, రాహుల్‌గాంధీకి లేదన్నారు. సిర్పూర్‌లోని స్పిన్నింగ్ మిల్లును కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటస్వామి కేంద్రంలో జౌళి శాఖ మంత్రిగా ఉన్నప్పుడే మూసివేసిందన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని మూసివేసింది కాంగ్రెస్సే అన్నారు. ఈ దేశంలో ప్రైవేట్ వాళ్లకు బొగ్గు అమ్ముకోవచ్చని నేర్పించి ఆనవాయితీగా చేసిందే కాంగ్రెస్ అని ఎండగట్టారు. తాడిచెర్ల బొగ్గు గనిని ప్రైవేట్ వాళ్లకు అప్పగించిందని విమర్శించారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు ఉంటే గోల్డెన్ హ్యాండ్‌షేక్ అనే దిక్కుమాలిన పథకాన్ని పెట్టి అనేకమంది ఉద్యోగులకు వీఆర్‌ఎస్ తీసుకునేలా బలవంతం పెట్టింది ఆ పార్టీనే అన్నారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకొని బొగ్గు గనులను మనకివ్వాలని కేంద్రంతో కొట్లాడి సాధించారన్నారు. అనేక గనులు తెరిచి కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించిన మనసున్న వ్యక్తి సీఎం కేసీఆర్ అన్నారు. దాదాపు 18 వేలకు పైగా డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చామని, నోటిఫికేషన్ ద్వారా దాదాపు 5వేలకు పైగా కొత్తగా ఉద్యోగాలు కల్పించామన్నారు. కోల్ ఇండియాలో కూడా లేనటువంటి అదనపు వేతనంతో కూడిన సెలవు దినాలు, సింగరేణి ఉద్యోగులకు కల్పించామన్నారు. గతంలో సింగరేణి కార్మికులకు మాత్రమే కార్పొరేట్ దవాఖానలో వైద్య సౌకర్యాలు పొందేందుకు అవకాశం ఉండేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కార్మికుల కుటుంబసభ్యులకు, వారి తల్లిదండ్రులకు సైతం కార్పొరేట్ దవాఖానలో ఉచితంగా వైద్యం పొందే అవకాశం కల్పించిందన్నారు. కాంగ్రెస్ డిస్మిస్ చేసిన 600 మంది సింగరేణి కార్మికులను తిరిగి ఉద్యోగాలకు తీసుకున్నది సీఎం కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. సింగరేణిలో 30శాతానికి పైగా వాటాలను కార్మికులకు పంచడమే కాకుండా గతంలో ఉన్న బకాయిలను సైతం విడుదల చేశామన్నారు.

### జీవన్‌రెడ్డికి సీనియారిటీ ఉంది కానీ సిన్సియారిటీ లేదు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి రాజకీయాల్లో సీనియార్టీ ఉంది. కానీ, ఆయనకు సిన్సియారిటీ లేదు. జీవన్ రెడ్డి కొంచెం సోయి తెచ్చుకొని మాట్లాడు. నన్ను క్వీన్ ఎలిజబెత్ రాణి అని పిలువడం సరికాదు. నేనేమి మీ ఇటలీ రాణిని కాదు. మీ ఇటలీ రాణి లెక్క వందలాది తెలంగాణ బిడ్డల ప్రాణాలను బలి తీసుకోలేదు. జీవన్‌రెడ్డి దిగజారిపోయి, తన హోదాను మరిచిపోయి తెలంగాణకు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అయినటువంటి పవిత్రమైన బతుకమ్మపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అసంబద్ధంగా ఉన్నది. ఆయన వయసు ఏంది? ఆయన మాట్లాడుతున్న మాటలు ఏంది? ఆయన స్థాయి, గౌరవం ఏంది? ఎన్నికల్లో గెలుపు కోసం ఇంతగా దిగజారాల్సిన అవసరం ఉన్నదా..? అలాంటి జీవన్ రెడ్డిని పక్కన పెట్టుకొని రాహుల్ గాంధీ జగిత్యాలలో ముచ్చట్లు చెప్పడం ఎంత వరకు సమంజసం. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్‌ఎస్ కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత, ఎంపీపీలు, జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్సీ కవిత సమక్షంలో పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

# ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ

- ₹8లక్షల బంగారం అప్పగింత
- అభినందించిన డిపో మేనేజర్, సిబ్బంది



ఆభరణాలను పరిశీలిస్తున్న జగిత్యాల డిపో మేనేజర్ వెంకట నర్సప్ప

జగిత్యాల, అక్టోబర్ 21: ఓ ఆర్టీసీ కండక్టర్ తన నిజాయితీని చాటుకున్నది. బస్సులో పోగొట్టుకున్న ₹8 లక్షల విలువైన బంగారు ఆభరణాలను అప్పగించింది. దీంతో కండక్టర్, డ్రైవర్‌ను డిపో మేనేజర్, సిబ్బంది అభినందించారు. వివరాల్లోకి వెళ్తే.. మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన పాదం భవాని శుక్రవారం రాత్రి పెద్దపల్లి నుంచి జగిత్యాలకు వెళ్లే బస్సు (టీఎస్ ఆర్టీసీ 3159)లో ఎక్కింది. తర్వాత ఆమె బస్సు దిగి వెళ్లే సమయంలో తన బంగారం నగలతో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను మరిచిపోయింది. బస్సు కండక్టర్ ముదం వాణి ఆ బ్యాగును గమనించి, అందులో ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా బాధితురాలికి కాల్ చేసింది. జగిత్యాల డిపో మేనేజర్ వెంకట నర్సప్ప సమక్షంలో సుమారు ₹8 లక్షల విలువైన బంగారు ఆభరణాలను తిరిగి భవానికి అందించారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడారు. తన నగలు దొరకక పోయి ఉంటే తమ ఇంట్లో దసరా పండుగ కన్నీళ్లతో గడిచేదని వాపోయింది. నిజాయితీగా తన బంగారు ఆభరణాలను అందించిన కండక్టర్ వాణికి, డ్రైవర్ తిరుపతి, సెక్యూరిటీ సిబ్బంది రమేశ్‌కు ధన్యవాదాలు తెలిపింది.

# నియోజకవర్గాలకు ఈవీఎంలు

- అదనపు కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్, అరుణశ్రీ పర్యవేక్షణలో తరలింపు

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి ఈవీఎం కేంద్రం గోదాం నుంచి ఎన్నికల సామగ్రిని నియోజకవర్గాలకు తరలిస్తున్న అధికారులు, సిబ్బంది →



పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 21: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని గోదాంలో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలను ప్రత్యేక వాహనాల్లో నియోజకవర్గాలకు తరలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం లాటరీ పద్ధతిలో పోలింగ్‌స్టేషన్ల వారిగా నియోజకవర్గాలకు కేటాయించారు. ఈ క్రమంలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ల పర్యవేక్షణలో పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులకు అప్పగించేందుకు వాహనాల్లో తీసకెళ్లారు. ఇక్కడ పెద్దపల్లి ఆర్‌డివొ మధుమోహన్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.